క్లుప్తంగా

ఓటర్ నమోదు ప్రక్రియపై శిక్షణ



మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాసరావు

దండేపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓటర్ నమోదు ప్రక్రియపై బీఎల్‌వోలకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆర్డీవో శ్రీనివాసరావు మాట్లాడారు. ఓటర్ నమోదు ప్రక్రియ పారదర్శకంగా జరగాలన్నారు. 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే, డీటీ మాధవి, ఆర్. భూమన్న తదితరులు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య వర్ధంతి



నివాళులర్పిస్తున్న కామ్రేడ్స్

బెల్లంపల్లి: తెలంగాణ తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని శుక్రవారం బెల్లంపల్లిలో ఘనంగా నిర్వహించారు. భారత కమ్యూనిస్టుపార్టీ (సీపీఐ) కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి విప్లవ జోహార్లు అర్పించారు. తెలంగాణ రైతాంగ సాయుధ గెరిల్లా పోరాట కార్యక్రమంలో దొడ్డి కొమురయ్య నిజాం పోలీసులు జరిపిన సాయుధ దాడిలో అమరుడయ్యాడని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చిప్ప నర్సయ్య, జిల్లా సమితి సభ్యుడు డీఆర్ శ్రీధర్, బెల్లంపల్లి పట్టణ సీపీఐ కార్యదర్శి ఆడేపు రాజమౌళి, సహాయ కార్యదర్శి బొల్లం తిలక్ అంబేద్కర్, నాయకులు రత్నం రాజం, ప్రశాంత్, ఉప్పుల శంకర్, గుండా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కోటపల్లి సీఐగా బన్సీలాల్



సీఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న బన్సీలాల్

కోటపల్లి: కోటపల్లి సీఐగా బన్సీలాల్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన సుధాకర్ ఇటీవల బదిలీల్లో భాగంగా జగిత్యాలకు బదిలీకాగా బన్సీలాల్‌కు కోటపల్లికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా సీఐ బన్సీలాల్ మాట్లాడుతూ.. మండలంలో శాంతి భద్రతలకు గ్రామస్తులు సహకరించాలని, ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. సీఐగా బాధ్యతలు స్వీకరించిన బన్సీలాల్‌ను కోటపల్లి ఎస్సై రాజేందర్, సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు హౌజింగ్ బోర్డు ప్లాట్ల వేలం

శ్రీరాంపూర్: నస్పూర్‌లోని హౌజింగ్ బోర్డు ప్లాట్లను నేడు(శనివారం) బహిరంగ వేలం వేస్తున్నట్లు తెలంగాణ హౌజింగ్ బోర్డు వరంగల్ డివిజన్ ఈఈ అంకం రావు తెలిపారు. నస్పూర్ కాలనీలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం ఇక్కడి సుమంగళి ఫంక్షన్ హాల్లో ఈ వేలం ప్రక్రియ జరుగనుందన్నారు. మొత్తం 25ఖాళీ ప్లాట్లను వేలం ద్వారా విక్రయించనున్నట్లు తెలిపారు. అప్‌సెట్ ధర గజానికి రూ.12వేలుగా నిర్ధారించినట్లు తెలిపారు. ఆసక్తి గల వారు డైరెక్టర్ ఈడీఎస్ పేయబుల్ ఎట్ హైదరాబాద్ పేరుతో రూ.2లక్షల డీడీ తీసుకొని ధరావతుగా సమర్పించి వేలంలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఒక ప్లాట్‌కు కనీసం మూడు బిడ్లు వస్తేనే ప్లాట్‌ను వేలం వేయనున్నట్లు తెలిపారు. స్ట్రైక్ రేట్ రూ.500కంటే తక్కువగా పాట పాడటానికి వీలు లేదన్నారు. వేలంలో ప్లాట్ దక్కించుకున్న వారు ప్లాట్ ధర మొత్తంలో 25శాతం మొత్తాన్ని 48గంటల్లోగా డిపాజిట్ చేయాల్సిందిగా తెలిపారు. చెల్లించని యెడల ధరావతు రూ.2లక్షలు జప్తు చేయబడుతాయన్నారు. ఉదయం 10గంటలకు వేలం ప్రక్రియ మొదలవుతుందన్నారు. ఆసక్తిగల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

మంచిర్యాల ఇన్‌చార్జి కమిషనర్‌గా సంపత్



మంచిర్యాలటౌన్: మంచిర్యాల నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్‌గా లక్సెట్టిపేట మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన్ను కార్యాలయం అధికారులు, ఉద్యోగులు శాలువాతో సత్కరించారు.

రాజకీయ ఒత్తిడితోనే కమిషనర్ బదిలీ?

- సెలవులో రెగ్యులర్ కమిషనర్
- రెండు రోజుల్లోనే ఇద్దరికి ఇన్‌చార్జి బాధ్యతలు



మంచిర్యాల నగర పాలక సంస్థ కార్యాలయం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల కార్పొరేషన్‌గా ఏర్పడి గాడిన పడుతున్న సమయంలో రెగ్యులర్ కమిషనర్ సెలవుపై వెళ్లడం, రెండు రోజుల్లోనే ఇద్దరికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. జనవరి 28న కార్పొరేషన్‌గా మారుస్తూ ఉత్తర్వులు జారీ చేయగా, జనవరి 31న తౌటం శివాజీని కమిషనర్‌గా ప్రభుత్వం నియమించింది. ఐదు నెలలుగా కార్పొరేషన్‌లో విలీనం అయిన నస్పూరు మున్సిపాలిటీ, హాజీపూర్ మండలంలోని 8 గ్రామాల విలీన ప్రక్రియ, కార్పొరేషన్‌లో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నారు. పాలకవర్గం లేకపోవడం, జిల్లా కలెక్టర్ స్పెషల్ ఆఫీసర్‌గా ఉండగా, పనులు ఆటంకం లేకుండా చేపడుతున్న సమయంలో, ప్రజాప్రతినిధులకు, కమిషనర్‌కు మధ్య అంతరాయం ఏర్పడినట్లు తెలిసింది. నస్పూరులో జరిగిన ప్రభుత్వ కార్యక్రమంలో కమిషనర్ శివాజీ పనితీరుపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేయడంతోనే, 15రోజులు సెలవు పెట్టి వెళ్లినట్లుగా తెలిసింది. ఈ నెల 1 నుంచి 15వ తేదీ వరకు శివాజీ సెలవు పెట్టి వెళ్లడంతో, ఆయన స్థానంలో జిల్లా కలెక్టర్ అసిస్టెంట్ కమిషనర్‌గా ఉన్న రాజమనోహర్‌కు 15రోజుల పాటు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. కేవలం రెండు రోజుల తేడాతోనే తిరిగి ఆ బాధ్యతలను లక్సెట్టిపేట కమిషనర్ సంపత్‌కుమార్‌కు ఇన్‌చార్జిగా అప్పగించడం చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం పాలకవర్గం లేకపోవడం, స్పెషల్ ఆఫీసర్‌గా జిల్లా కలెక్టర్ ఉండడంతో, కలెక్టర్ ఆదేశాలతోనే కమిషనర్ల మార్పులు జరుగుతున్నాయి. రెగ్యులర్ కమిషనర్ లేకపోవడం, సెలవులో వెళ్లిన కమిషనర్ శివాజీ తిరిగి విధుల్లో చేరరని బల్దియాలో గుసగుసలు వినిపిస్తున్నాయి. కొత్తగా రెగ్యులర్ కమిషనర్‌ను నియమించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లుగా సమాచారం. కార్పొరేషన్‌గా మారిన మంచిర్యాలలో కమిషనర్ల మార్పుతో అభివృద్ధి పనులపై ప్రభావం చూపనుండగా, పారిశుధ్య విభాగం, ఇంజనీరింగ్ విభాగం, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ విభాగాల్లోని సిబ్బంది విధులను సక్రమంగా నిర్వర్తించడం లేదని తెలుస్తోంది.

ఆర్టీసీ బస్సులు రాక అవస్థలు



మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పరిసర ప్రాంతాల విద్యార్థులతో పాటు ప్రజలు ఆర్టీసీ బస్సు లేక ఇబ్బంది పడుతున్నారు. దొనబండ–పెద్దంపేట గ్రామాల మీదుగా గతంలో ఉన్న ఆర్టీసీ బస్సును పాఠశాలలకు వేసవి సెలువులు రావడంతో నిలిపివేశారు. ప్రస్తుతం పాఠశాలలు ప్రారంభమైనా ఇంతవరకు ఆర్టీసీ బస్సు ప్రారంభం కాకపోవడంతో విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థులు బడికి వెళ్లాలంటే ఉదయం, సాయంకాలం వేళ ఆటోలో ప్రయాణిస్తూ, చాలా అవస్థలు పడుతున్నారు. ఆర్టీసీ బస్సు పునఃప్రారంభించి విద్యార్థులు, ప్రజల ఇబ్బందులు దూరం చేయాలని పలువురు కోరుతున్నారు.

కేజీబీవీలో ఘనంగా వనమహోత్సవం

- మొక్కలు నాటిన కలెక్టర్ కుమార్‌దీపక్



మొక్క నాటి నీరుపోస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): వాతావరణ సమతుల్యతను కాపాడేందుకుగాను ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమ లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించాలని జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. హాజీపూర్ మండలం కర్ణమామిడిలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం నిర్వహించిన వనమహోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొనగా పాఠశాల విద్యార్థులు ఘనస్వాగతం పలికారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో పాటు అధికారులతో కలిసి కలెక్టర్ మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటడంతో పాటు సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో కిషన్, డీఈవో యాదయ్య, ఎంపీడీవో ప్రసాద్, ఈజీఎస్ ఏపీవో మల్ల య్య, ఈసీ శ్రీనివాసరెడ్డి, కేజీబీవీ ప్రత్యేకాధికారి స్వప్న, పంచాయతీ కార్యదర్శి వెంకటస్వామి, టీఏ స్రవంతి, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

ఇందిరా మహిళా భవన్‌ను త్వరగా నిర్మించాలి

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని పాతమంచిర్యాలలో నిర్మిస్తున్న ఇందిరా మహిళా భవన్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. నిర్మాణ పనులను శుక్రవారం పరిశీలించారు.

ఘనంగా రోశయ్య జయంతి



బెటాలియన్‌లో నివాళులర్పిస్తున్న కమాండెంట్ వెంకటరాములు, సిబ్బంది

లక్సెట్టిపేట/జైపూర్/శ్రీరాంపూర్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో శుక్రవారం మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి ఘనంగా నిర్వహించారు. బెటాలియన్ కమాండెంట్ పి.వెంకటరాములు రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు అడ్మిన్ భవన కార్యాలయంలో ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎం శ్రీనివాసులు, వోఅండ్‌ఎం చీఫ్ జెన్‌సింగ్ నివాళులర్పించారు. లక్సెట్టిపేట మండలంలోని ఆవోపా నాయకుల ఆధ్వర్యంలో నివాళులర్పించారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్ద ఏరియా జీఎం శ్రీనివాస్ రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏరియా ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, ఏజీఎం(ఫైనాన్స్) బీభత్సా, డీజీఎం(పర్సనల్) ఎస్ అనిల్‌కుమార్, డీజీఎం(ఐఈడీ) రాజన్న తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎమ్మెస్ ఉమెన్ సెల్ ఇన్‌చార్జిగా మౌనిక



మౌనిక

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియా హెచ్ఎమ్మెస్ ఉమెన్ సెల్ ఇన్‌చార్జిగా కేకే–ఓసీలో జనరల్ అసిస్టెంట్ విధులు నిర్వర్తిస్తున్న మౌనికను నియమిస్తూ శుక్రవారం హెచ్‌ఎమ్మెస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ ఉత్తర్వులు జారీ చేశారు. మహిళ ఉద్యోగుల సమస్యలపై యూనియన్ నాయకుల సహకారంతో తన వంతు పోరాటం చేస్తానని ఆమె పేర్కొన్నారు.

వైద్య పరీక్షలు చేయించుకోవాలి



మందమర్రిరూరల్: మున్సిపల్ కమిషనర్‌కు వైద్య పరీక్షలు చేస్తున్న డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్

బెల్లంపల్లి/మందమర్రిరూరల్/చెన్నూర్/మంచిర్యాలటౌన్: జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో ఉద్యోగులు, మెప్మాలోని మహిళలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీశ్‌రాజ్ అన్నారు. మంచిర్యాల కార్పొరేషన్ కార్యాలయం, బెల్లంపల్లి, మందమర్రి, చెన్నూర్ మున్సిపల్ కార్యాలయాల ఆవరణలో శుక్రవారం వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. జబ్బులపై అవగాహన కల్పించి అవసరమైన వారికి మందులు అందజేశారు. మంచిర్యాలలో మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ సంపత్‌కుమార్, వైద్యులు శివప్రతాప్, స్నేహిత, అమన్, రాము, రజిత, డీపీవో ప్రశాంతి, డెమో వెంకటేశ్వర్లు, బెల్లంపల్లిలో మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేశ్, వైద్యులు సుచరిత, సహన, సౌజన్య, శిరీష, రామకృష్ణ, మున్సిపల్ మేనేజర్ మజర్, డీఈ సాయికిరణ్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్, టీఎంసీ దుర్గయ్య, సీఓ కిరణ్, మందమర్రిలో డీఎంహెచ్‌వో హరీష్ రాజ్, మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు, వైద్యుడు రమేశ్, చెన్నూర్‌లో మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, వైద్యులు లక్ష్మీ ప్రసన్న, కృష్ణతేజ, యూనిట్ ఆఫీసర్ జగదీశ్, రామకృష్ణ, వైద్య సిబ్బంది, మున్సిపల్ కార్యాలయాల సిబ్బంది ఉన్నారు.

చదువుతోపాటు ఆరోగ్యం ముఖ్యం

మంచిర్యాలటౌన్: విద్యార్థులకు చదువుతోపాటు ఆరోగ్యం కూడా ముఖ్యమని డీఎంహెచ్‌వో డాక్టర్ హరీశ్‌రాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని హైటెక్‌సిటీలో మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసంక్రమిత వ్యాధుల ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రసాద్, పాతమంచిర్యాల యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివప్రతాప్, డెమో బుక్క వెంకటేశ్వర్, సీహెచ్‌వో దీక్షితరాణి, హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, సబ్ యూనిట్ అధికారి నాందేవ్, ప్రిన్సిపాల్ రజిత పాల్గొన్నారు.

ఎస్సీ వసతిగృహంలో మెడికల్ క్యాంపు

మంచిర్యాలఅర్బన్: స్థానిక ఎస్సీ కళాశాల బాలుర వసతిగృహంలో శుక్రవారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. వైద్యురాలు తస్నియా విద్యార్థులకు పరీక్షలు జరిపించి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. మెడికల్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో దోమల నివారణకు పరిసరాల్లో స్ప్రే చేశారు. కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమాధికారి కుమారస్వామి, ఏఎన్‌ఎం విజయలక్ష్మి పాల్గొన్నారు.

నంబరు మారి వేరొకరికి డబ్బులు

నస్పూర్: ఫోన్ పే నంబరు మారడంతో వేరొకరికి డబ్బులు వెళ్లాయి. సీసీసీ నస్పూర్ పోలీసుస్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై ఉపేందర్‌రావు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. తీగల్‌పహాడ్‌కు చెందిన లింగం స్వరూప తనకు నగదు డబ్బు అవసరమని ఫోన్ పే ద్వారా తన స్నేహితురాలికి రూ.50వేలు పంపించింది. ఆ డబ్బులు వేరొక వ్యక్తికి వెళ్లడంతో మోసం జరిగిందని గ్రహించి సైబర్‌క్రైం నంబరు 1930కు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని ఆ డబ్బును హోల్డ్ చేయించినట్లు ఎస్సై తెలిపారు.

రేంజ్ అధికారిగా హఫిజొద్దీన్



వేమనపల్లి: నీల్వాయి అటవీ రేంజ్ అధికారిగా హఫిజొద్దీన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ రేంజ్ అధికారిగా పనిచేసిన అప్పలకొండ ఏసీఎఫ్ క్యాడర్‌లో భూపాలపల్లి అటవీ డివిజన్‌కు ఎఫ్‌డీఓగా బదిలీ అయ్యారు. లక్సెట్టిపేట డెప్యూటీ రేంజ్ అధికారిగా పనిచేసిన హఫీజొద్దీన్ నీల్వాయి రేంజ్‌కు పదోన్నతిపై వచ్చారు.

నాలుగో ఆర్థిక శక్తిగా భారత్

చెన్నూర్: ప్రపంచంలోనే భారతదేశం నాలుగో ఆర్థిక శక్తిగా ఎదిగిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. ప్రధాని మోదీ పదకొండేళ్ల పాలన సాధించిన విజయాల కరపత్రాలను ఇంటింటికీ అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు శ్రీపాల్, నాయకులు తిరుపతి, కొండపాక చారి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగికి విరమణ తప్పనిసరి

- డీఈవో యాదయ్య



రాజరావు దంపతులను సన్మానిస్తున్న డీఈవో

జన్నారం: ప్రభుత్వ ఉద్యోగికి, ఉపాధ్యాయులకు ఉద్యోగ విరమణ తప్పనిసరి అని, ఉద్యోగం సమయంలో సంపాదించుకున్న మంచి, చెడు చిరకాలం ఉంటుందని మంచిర్యాల జిల్లా విద్యాధికారి యాదయ్య అన్నారు. ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన పిట్టల రాజరావుకు పీఆర్టీయూ ఆధ్వర్యంలో శుక్రవారం జన్నారం మండల కేంద్రంలోని పీఆర్టీయూ భవన్‌లో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ఉద్యోగ ధర్మాన్ని కర్తవ్యంగా భావించి, సేవలందించినప్పుడే వారికి ప్రజల్లో గుర్తింపు వస్తుందన్నారు. ప్రతీ ఉపాధ్యాయుడు అంకితభావంతో పని చేసి గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కొట్టె శంకర్, ప్రధాన కార్యదర్శి బచ్చ మోహన్‌రావు, తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఎస్సై అనూష, ఎంఈవో విజయ్‌కుమార్, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు కట్ట రాజమౌళి తదితరులు పాల్గొన్నారు. అనంతరం తిమ్మాపూర్ గ్రామం ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పరిసరాలు, వంటగదిని శుభ్రంగా ఉంచుకోవాలని నిర్వాహకులకు తెలిపారు. మెనూ ప్రకారం భోజనం ఇవ్వాలన్నారు. ఆయన వెంట ఎంఈవో విజయ్‌కుమార్, హెచ్‌ఎం శ్రీనివాస్ తదితరులున్నారు.

‘మత్తు మహమ్మారిని పెంచిపోషిస్తున్న ప్రభుత్వం’



మాట్లాడుతున్న సంకె రవి

పాతమంచిర్యాల: ప్రభుత్వం మత్తు మహమ్మారిని పెంచి పోషిస్తూ అనర్థాలకు కారణంగా నిలుస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాల నివారణకు, మత్తు నుంచి తమ కుటుంబాలను కాపాడుకోవడానికి జిల్లా ప్రజలు ఉద్యమబాట పట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోమాస ప్రకాష్, దూలం శ్రీనివాస్, దుంపల రంజిత్, జిల్లా కమిటీ సభ్యులు దూర్కె మోహన్ పాల్గొన్నారు.

పేదలకు సాగు భూములివ్వాలి

దండేపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు భూమిలిస్తామని హామీలిచ్చి, అధికారంలోకి రాగానే వాటిని మరిచారని, నిరుపేదలను గుర్తించి సాగు భూములు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి డిమాండ్ చేశారు. దండేపల్లి మండల కేంద్రంలో శుక్రవారం అమరజీవి దొడ్డి కొమురయ్య వర్ధంతిలో పాల్గొని మాట్లాడారు. భూమి, భుక్తి, వెట్టి చాకిరి నుంచి విముక్తి కోసం జరిగిన పోరాటం ద్వారా పేదలకు భూములు దక్కాయని, ప్రభుత్వాలు పేదలకు భూములు పంచకుంటే మరో పోరాటానికి తెరలేపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి, కనికరపు అశోక్, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అబ్బుల్ల తదితరులు పాల్గొన్నారు.

కార్మికవర్గం సమ్మె విజయవంతం చేయాలి



శ్రీరాంపూర్: మాట్లాడుతున్న నాయకులు

శ్రీరాంపూర్/మందమర్రిరూరల్/కాసిపేట: ఈ నెల 9న చేపట్టే ఒక్కరోజు సార్వత్రిక సమ్మెను కార్మిక వర్గం విజయవంతం చేయాలని కాసిపేటలో ఏఐటీయూసీ డెప్యూటీ జనరల్ సెక్రెటరీ ముస్కె సమ్మయ్య, బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, మందమర్రిలో కార్మిక సంఘాల నాయకులు, శ్రీరాంపూర్‌లో సింగరేణి కార్మిక సంఘాల ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. మందమర్రి ఏరియా కాసిపేట గనిపై, మందమర్రి ఏరియాలోని కేకే–ఓసీపై, శ్రీరాంపూర్ ఆర్కే న్యూటెక్ గనిపై శుక్రవారం జేఏసీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సార్వత్రిక సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో కాసిపేటలో సీఐటీయూ డెప్యూటీ జనరల్ సెక్రెటరీ నాగరాజు గోపాల్, ఐఎన్‌టీయూసీ సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ బన్న లక్ష్మణ్‌దాస్, టీబీజీకేఎస్ జనరల్ సెక్రెటరీ సురేందర్‌రెడ్డి, శ్రీరాంపూర్‌లో వేదిక నాయకులు, హెచ్‌ఎంఎస్ కేంద్ర నాయకులు తిప్పారపు సారయ్య, బ్రాంచ్ కార్యదర్శి పానగంటి అశోక్, కొమురయ్య, అనిల్ కుమార్, ఐఎఫ్‌టీయూ నాయకులు బ్రహ్మానందం, మేకల రాములు సింగరేణి ఉద్యోగుల సంఘం నాయకులు సమ్ము రాజయ్య, గుంపుల సారయ్య, టీఎస్టీయూసీ నాయకులు రాజబాబు, ఐఎఫ్‌టీయూ నాయకులు పోచమల్లు, మందమర్రిలో హెచ్‌ఎమ్మెస్, ఐఎఫ్‌టీయూ, టీఎస్‌టీయూసీ, సింగరేణి ఉద్యోగుల సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

వర్కింగ్ జర్నలిస్టులకు క్వార్టర్స్ కేటాయించాలి

మందమర్రిరూరల్: ఏరియాలోని వర్కింగ్ జర్నలిస్టులకు సింగరేణి క్వార్టర్స్ కేటాయించాలని కోరుతూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) నాయకులు శుక్రవారం ఏరియా జీఎం దేవేందర్‌కు వినతిపత్రం అందించారు. ఏరియాలోని జర్నలిస్టులు సమస్యలతో పోరాడుతూ, సంస్థ తరుపున అనేక వార్తాకథనాలు అందిస్తూ స్వచ్ఛందంగా సేవ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు మిట్టపల్లి మధు, నాయకులు శ్రీనాథ్, మడ్డి వేణు, గోపాల్‌గౌడ్, సుమన్, బాస్కర్, సురేష్ ఉన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

చెన్నూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందని మాజీ కౌన్సిలర్ రేవెల్లి మహేశ్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జాతీయ రహదారిపై వేలాది లారీలు ఉండడంతో ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. అక్రమ రవాణాలపై మాట్లాడితే అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు నాయబ్, తిరుపతి సురేశ్, ప్రశాంత్‌రెడ్డి, దేవేందర్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఖర్గే సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

దండేపల్లి/తాండూర్/కాసిపేట/మంచిర్యాలటౌన్: హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభకు మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్ నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లారు.

ముందస్తు అరెస్ట్

మందమర్రిరూరల్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. పలు విద్యార్థి సంఘాల నాయకులను శుక్రవారం అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్లకు తరలించారు. మందమర్రిలో బట్టు రాజ్‌కుమార్, ముస్తఫా, సీపెల్లి సాగర్, బచ్చలి ప్రవీణ్‌కుమార్, అభిరామ్, హాజీపూర్‌లో యూఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

‘ఆతిథ్యమిచ్చి సాగనంపారు’

మందమర్రిరూరల్: చత్తీస్‌ఘడ్ రాష్ట్రం నిఖిల్‌గాట్ నుంచి గత నెల 27న సైకిల్ యాత్ర చేపట్టి ఈ నెల 10న హైదరాబాద్‌లోని నిఖిల్ చేతన ఆశ్రమంలో నిర్వహించే గురుపూర్ణిమ మహోత్సవ కార్యక్రమానికి హాజరయ్యేందుకు 40మంది భక్తులు బయలుదేరి గురువారం రాత్రి మందమర్రి చేరుకున్నారు. వారికి స్థానిక అయ్యప్పస్వామి దేవాలయంలో ఆలయ కమిటీ విడిది కల్పించి అన్న ప్రసాదాలు అందించింది. శుక్రవారం ఉదయం అల్పాహారం అందించి తిరిగి వారిని కమిటీ సాదరంగా సాగనంపింది.

ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ కమిటీ మెంబర్‌గా రవీందర్

మంచిర్యాలటౌన్: పట్టణంలోని గౌతమినగర్‌కు చెందిన బీజేపీ నాయకులు వెరబెల్లి రవీందర్‌రావును తెలంగాణ స్టేట్ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ కమిటీ మెంబర్‌గా నియమించినట్లు చాంబర్ సెక్రటరీ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పదవి రెండు సంవత్సరాల వరకు ఉంటుందని, ఫిల్మ్ చాంబర్ కమిటీ మెంబర్‌గా ఆయన సేవలు కొనసాగుతాయని తెలిపారు.

అంతర్‌పంటతో బహుళ ప్రయోజనాలు

నెన్నెల: పత్తిలో అంతర్‌పంటలు వేయడంతో రైతులకు బహుళ ప్రయోజనాలు కలుగుతాయని భీమిని ఏడీఏ సురేఖ అన్నారు. నెన్నెల ఏఓ సృజన, ఏఈఓ రాంచందర్‌లతో కలిసి శుక్రవారం కంది విత్తనాలు పంపిణీ చేసి క్షేత్రస్థాయిలో కూలీలకు అవగాహన కల్పించారు.

‘పంట మార్పిడితో భూసారం మెరుగు’

జన్నారం: ధాన్యం లేదా పత్తి పంట తర్వాత పంట మార్పిడి చేయడం వల్ల భూసారం మెరుగవుతుందని ఏవో సంగీత అన్నారు. జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా శుక్రవారం జన్నారం మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతులకు కంది బ్యాగులు పంపిణీ చేశారు.

‘పత్తిలో మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు’

కాసిపేట: రైతులు పత్తిలో మోతాదుకు మించి ఎరువులు వాడొద్దని, అధికంగా ఎరువులు వాడటం వల్ల పంటకు మేలు చేసే క్రిములు సైతం నశించి నష్టం వాటిల్లే ప్రమాదం ఉంటుందని మండల వ్యవసాయాధికారి ప్రభాకర్ తెలిపారు. మండలంలోని కాసిపేట గ్రామ పరిధిలోని పంటలను శుక్రవారం సందర్శించి రైతులకు అవగాహన కల్పించారు.

విద్యార్థినికి సన్మానం

మంచిర్యాలటౌన్: తెలంగాణ రైఫిల్, పిస్టల్ రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్ పోటీల్లో మంచిర్యాలలోని గౌతమినగర్‌కు చెందిన వెరబెల్లి మహతి ఎస్28 10మీటర్ల రైఫిల్ షూటింగ్‌లో 2వ స్థానం సాధించగా, ఆ విద్యార్థిని శుక్రవారం బీజేపీ నాయకులు అభినందించారు. కార్యక్రమంలో వెరబెల్లి రవీందర్‌రావు, అమిరిశెట్టి రాజ్‌కుమార్, గాజుల ముఖేశ్ గౌడ్, పట్టి వెంకటకృష్ణ, బియ్యాల సతీష్‌రావు, ఎనగందుల కృష్ణమూర్తి, మెట్టుపల్లి జయరామారావు తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో చిన్నారి ప్రతిభ



చిన్నారిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బెల్లంపల్లి: బెల్లంపల్లికి చెందిన ఓ చిన్నారి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటుకుంది. సికింద్రాబాద్‌లో గత జూన్ 30న తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్–2025 పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో లోటస్ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న అడిచర్ల అక్షయ అండర్–8 విభాగంలో జరిగిన అథ్లెటిక్స్ లాంగ్‌జంప్ ఈవెంట్‌లో పాల్గొని ఐదో స్థానాన్ని దక్కించుకుంది. అంతకు ముందు జిల్లా స్థాయి పోటీల్లో అక్షయ ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. తమ పాఠశాల విద్యార్థి సత్తాచాటడంతో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.